నూరు శాతం పింఛన్ల పంపిణీ

- అర్బన్ పరిధిలో 29,950 మంది లబ్ధిదారులు
- రూ.8.85 కోట్ల నగదు పంపిణీ
- అనారోగ్య కారణాలతో వేరేచోట ఉన్న వారి వద్దకు వెళ్లి అందజేత

సీటీఆర్ఐ: ఈ నెలకు సంబంధించిన పింఛన్ల పంపిణీ శనివారంతో వంద శాతం పూర్తి చేశారు. ఇంటి వద్దకు వెళ్లి లబ్ధిదారులకు పింఛన్ ఇవ్వడమే కాకుండా అనారోగ్య, ఇతర కారణాల వల్ల ఇతర ప్రాంతాల్లో ఉంటే అక్కడకు వెతుక్కుంటూ వెళ్లి మరి వలంటీర్లు పింఛన్లను అందించారు.

ఎంతలో ఎంత మార్పు..ఐదేళ్ల క్రితం పింఛను తీసుకోవాలంటే అదో పెద్ద ప్రహసనం. కాళ్ల చెప్పులు అరిగిపోయేలా పింఛన్ తీసుకోవడానికి తిరిగి తిరిగి స్పృహ తప్పిన అవ్వా, తాతలు ఎంతమందో మనకి కనిపించేవారు. పింఛన్‌కు అర్హులైన పింఛన్ తీసుకోవడానికి వెళితే అప్పటి టీడీపీ జన్మభూమి కమిటీల ఛీదరింపులు, ఛీత్కారాలు, ఎవరోఒకరు చనిపోతే అప్పుడు మీకు పింఛన్ రాస్తామని కసురుకుంటే బాధపడిన సందర్భాలు అనేకం. పాదయాత్రలో వీరి బాధను చూసి జగన్‌మోహన్‌రెడ్డి చలించిపోయారు. ఆయన అధికారంలోకి వచ్చిన వెంటనే పింఛన్‌ను పెంచుకుంటూ పోవడమే కాకుండా పింఛన్ తీసుకోవడంలో ఇబ్బంది లేకుండా చేస్తానని మాట ఇచ్చారు. మాట ఇచ్చిందే తడవుగా అధికారంలోకి రాగానే సచివాలయ వ్యవస్థని ఏర్పాటు చేసి వలంటీర్ల ద్వారా ఇంటి వద్దకే పింఛన్ అందించే ఏర్పాటు చేశారు. ఈ ఐదు సంవత్సరాల కాలంలో పింఛన్ లబ్ధిదారులకు ఆలస్యంగా అందిన సందర్భం లేదు. అంతే కాకుండా సంవత్సరానికి రెండు సార్లు పింఛన్ నమోదు చేసి అర్హులైన కొత్త వారికి పింఛన్ మంజూరు చేస్తున్నారు.


కాకినాడలో చికిత్స పొందుతున్న సులోచనకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ సురేంద్ర


ఏలూరులో బంధువుల వద్ద ఉంటున్న ఖతిజబీకి పింఛన్ అందిస్తున్న వలంటీర్ అనుషా


అనపర్తిలో శేషమ్మకు పెన్షన్ అందిస్తున్న వలంటీర్ శ్యామల


క్యాన్సర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న లబ్ధిదారుకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ కీర్తి

అర్బన్‌లో వంద శాతం పంపిణీ పూర్తి

రాజమహేంద్రవరం అర్బన్ పరిధిలో 29,950 మంది పింఛన్ లబ్ధిదారులు ఉండగా ప్రభుత్వం మంజూరు చేసిన రూ. 8.85 కోట్లు నగదు పంపిణీ చేసి వంద శాతం అందజేశారు.

వేరే చోటకి వెళ్లి పింఛన్ అందజేత

ఇక్కడే ఉంటూ పింఛన్ తీసుకుంటూ కొన్ని అనివార్య కారణాల వల్ల, అనారోగ్య సమస్యల వల్ల వేరే చోట ఉంటున్న పింఛన్ లబ్ధిదారుల వద్దకి సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు వెళ్లి మరి పింఛన్ పంపిణీ చేస్తున్నారు. వారి అవసరాలకు ఈ పింఛన్ ఎంతోగానో ఉపయోగపడుతోంది. వారు ఆసుపత్రుల్లో ఉన్నందు వల్ల పింఛన్ తీసుకోవడానికి రాలేకపోతున్నారని వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు మానవతా దృష్టితో వారి వద్దకు వెళ్లి మరీ పింఛన్ అందిస్తున్నారు. 31వ డివిజన్ అన్నపూర్ణమ్మపేటలోని 57 సచివాలయానికి చెందిన వలంటీర్ కె.సురేంద్రర్ కాకినాడలోని జనరల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మేరీ సులోచనకి పింఛన్ అందించారు. అనారోగ్య కారణంతో ఏలూరులో తమ బంధవుల వద్ద ఉంటున్న అదే సచివాలయ పరిధికి చెందిన ఖతిజబీకి వలంటీర్ అనుషా వెళ్లి పింఛన్ అందించారు. స్థానిక కేన్సర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న లబ్ధిదారులకి కీర్తి పింఛన్ అందించారు.

ప్రతి నెలా అనపర్తి వెళ్లి పెన్షన్ అందజేత

కడియం: మండలంలోని దామిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన వలంటీర్ గెడ్డం శ్యామల ప్రతి నెలా అనపర్తి వెళ్ళి వృద్ధాప్య పెన్షన్ అందిస్తూ అందరికీ స్ఫూర్తిగా నిలుస్తోంది. వివరాల్లోకి వెళితే గ్రామానికి చెందిన చింతపర్తి శేషమ్మ పక్షవాతం కారణంగా అనపర్తిలోని కుమార్తె ఇంటి వద్ద ఉంటోంది. దీంతో ఆమెకు అందాల్సిన పెన్షన్‌ను గత ఆరు నెలలుగా ప్రతినెలా అనపర్తి వెళ్ళి వలంటీర్ శ్యామల ఆమెకు అందజేస్తోంది.

క్రీడాకారుడికి వయసుతో సంబంధం లేదు

ఎంపీ భరత్‌రామ్

ప్రకాశం నగర్ : క్రీడాకారులకు వయసుతో సంబంధం లేదని, ఆడాలి, గెలవాలనే లక్ష్య సంకల్పానికి వయసు అడ్డు కాదని రాజమహేంద్రవరం ఎంపీ, అర్బన్ నియోజకవర్గ సమన్వయ కర్త మార్గాని భరత్‌రామ్ అన్నారు. ఆదివారం ఎస్పీ కార్యాలయం క్రీడా మైదానంలో బజాజ్ గ్లాడియేటర్స్, లెజెండ్స్ కప్ – (2024) సీజన్ 3 క్రికెట్ టోర్నమెంట్‌ను ఎంపీ భరత్ ప్రారంభించారు. టోర్నీలో ఉభయ ఉమ్మడి గోదావరి జిల్లాలు, కృష్ణా జిల్లా నుంచి ఎనిమిది క్రికెట్ టీమ్స్ పాల్గొన్నాయి. ఈ కార్యక్రమానికి ఎంపీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజమహేంద్రవరం నగరానికి క్రీడలలో గుర్తింపు వచ్చే విధంగా అన్ని సౌకర్యాలు కలగజేస్తామన్నారు. నగరాన్ని బహుముఖంగా అభివృద్ధి చేశామని, నాగుల చెరువు బజారులో క్రికెట్ స్టేడియం నిర్మాణ విషయంలో తలెత్తిన సాంకేతిక సమస్యల కారణంగా పనులు ముందుకు సాగడం లేదని, అయినప్పటికీ అక్కడ స్టేడియం నిర్మించి తీరతామన్నారు. నన్నయ విశ్వవిద్యాలయంలో ఇండోర్ స్టేడియం రూ.20 కోట్లతో నిర్మించామని, సెకండ్ ఫేజ్‌లో అథ్లెటిక్ ట్రాక్ నిర్మించనున్నామని తెలిపారు. నగరంలో ఐటీ పార్కు, పరిశ్రమలు రావాల్సి ఉందన్నారు. ఔటర్ రింగ్ రోడ్ మంజూరు అయిందని చెప్పారు. దేశంలోనే నగరాన్ని నెంబర్ వన్ స్థానంలో ఉంచాలన్నదే తన కోరిక, ప్రయత్నం అని ఎంపీ భరత్ తెలిపారు. ఇంటిలిజెన్స్ సీఐ సూర్యభాస్కర్ మాట్లాడుతూ క్రికెట్ అన్ని వయసుల వారికీ ఇష్టమైన క్రీడ అన్నారు. లెజెండ్ కప్పు సీజన్ త్రీ టోర్నీ నిర్వాహకులు జయకిషన్, ప్రభాకర్, శ్రీనివాస్ చౌదరి మాట్లాడుతూ నలభై సంవత్సరాలు దాటిన వారిని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఈ టోర్నమెంట్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ టోర్నీ ఈ నెల 4 నుంచి 11వ తేదీ వరకు ఎనిమిది రోజుల పాటు జరుగుందని తెలిపారు. ఆదివారం నిర్వహించిన పోటీలలో రాజమండ్రి క్రికెట్ క్లబ్ వర్సెస్ సర్దార్ కింగ్స్ తలపడగా, మధ్యాహ్నం బజాజ్ గ్లాడియేటర్స్ వర్సెస్ ఫ్రెండ్స్ క్రికెట్ క్లబ్ జట్లు తలపడ్డాయి. కాగా వీరంతా ఫార్టీ ప్లస్ వయసు ఉన్న వారే కావడం గమనార్హం.


లెజెండ్స్ కప్ క్రికెట్ టోర్నీ ప్రారంభోత్సవ సభలో మాట్లాడుతున్న ఎంపీ భరత్‌రామ్

క్రీడలకు ప్రోత్సాహం

క్రీడలకు అన్ని రకాలుగా ప్రోత్సాహం అందిస్తామని ఎంపీ, అర్బన్ సమన్వయకర్త మార్గాని భరత్‌రామ్ అన్నారు. ఆదివారం నగరంలోని 43వ వార్డు వీవర్స్ కాలనీ స్కేటింగ్ రింగ్‌లో 'ఇన్విటేషన్ ఓపెన్ రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్'ను ఆయన ప్రారంభించారు. రాజమండ్రి నగరంలో క్రీడాకారుల కోసం ఇంటర్నేషనల్ స్టాండర్డ్స్ తో స్టేడియమ్స్ తీసుకు వస్తామన్నారు. వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

చట్టసభల్లో ఎక్కువ మంది బీసీలు అడుగుపెట్టాలి

ప్రకాశం నగర్ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజమహేంద్రవరం ఎంపీ సీటు బీసీ వర్గానికి చెందిన డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌కు కేటాయించినందున, టీడీపీ –జనసేన కూటమి కూడా ఎంపీ సీటు బీసీలకే ఇవ్వాలని జిల్లా బీసీ సంక్షేమ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం జరిగిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడు సానబోయిన రామారావు మాట్లాడుతూ టీడీపీ బీసీ ఓటు బ్యాంకును కాపాడుకోవాలంటే ఎంపీ సీటును ధనిక వర్గానికి చెందిన ఓసీకి కాకుండా ఈసారి బీసీకి కేటాయించాలని సూచించారు. వైఎస్సార్ సీపీ నరసాపురం ఎంపీ సీటు కూడా న్యాయవాది గూడూరి ఉమాబాలకు ఇచ్చిందని గుర్తు చేశారు. గోదావరి జిల్లాల్లో బీసీలు అధికంగా ఉన్న అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రధాన రాజకీయ పార్టీలు బీసీలకే టిక్కెట్లు కేటాయించాలని కోరారు. చట్టసభల్లో బీసీలు ఎక్కువగా అడుగు పెట్టాలంటే టీడీపీ, వైకాపా బీసీ అభ్యర్థులకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. సంఘం గౌరవాధ్యక్షుడు మేడిశెట్టి తాతబ్బాయి, ప్రధాన కార్యదర్శి గౌర్సా తాతబ్బాయి యాదవ్, ఉపాధ్యక్షుడు ఉప్పిడి గంగాధర్ కోశాధికారి గుత్తుల సుబ్రహ్మణ్యం మాట్లాడారు.


సమావేశంలో మాట్లాడుతున్న సానబోయిన రామారావు

ఏటీఎంలో కుక్కల బెడద

రాజమహేంద్రవరం రూరల్: స్థానిక బాలాజీ పేట సెంటర్‌లోని ఎస్‌బీఐ ఏటీఎంలో కుక్కల బెడద ఎక్కువైంది. 24గంటల పాటు కుక్కలు ఏటీఎంలోనే విశ్రాంతి తీసుకోవడంతో నగదు తీసుకుని వెళ్లేందుకు భయపడుతున్నారు. రెండు ఏటీఎం మెషీన్‌ల మధ్య కుక్కలు నిద్రిస్తుండడంతో ఇప్పటికైనా సదరు బ్యాంకు అధికారులు ఏటీఎంలలోకి కుక్కలు వెళ్లకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.


బాలాజీపేట ఎస్‌బీఐ ఏటీఎంలో కుక్కలు

నేడు గిరిజన సాంస్కృతిక మహోత్సవం

ప్రకాశం నగర్ : ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో సోమవారం ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ (టీఎస్ఎఫ్) ఆధ్వర్యంలో జరగబోయే ఆదివాసి సాంస్కృతిక మహోత్సవాన్ని జయప్రదం చేయాలని టీఎస్ఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లిభాస్కర్ పిలుపునిచ్చారు. ఆదివారం జరిగిన సమావేశంలో టీఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షుడు అక్కులప్ప నాయక్, టీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రాగిరి చంద్రప్ప ,రాష్ట్ర కార్యదర్శి విష్ణు నాయక్ మాట్లాడుతూ గిరిజన సాంస్కృతిక, సంప్రదాయాలు దేశానికి పట్టుగొమ్మలు లాంటివి అని, వాటిని కాపాడుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఆధునికత సోకని గిరిజన కళారూపాలు మన సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతిరూపం అని ప్రపంచీకరణ నేపథ్యంలో అంతరించిపోతున్న వాటిని కాపాడుకోవాలన్నారు. టీఎస్ఎఫ్ నాయకులు రాజకుమార్ రెడ్డి, చిన్న పాల్గొన్నారు.

సంస్కృతికి దర్పణం బల్లల పండగ

రాజమమేంద్రవరం సిటీ: మన సంస్కృతీ సంప్రదాయాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. ఆదివారం నగరంలోని శేషయ్య మెట్ట వద్ద శీలం వెంకన్న రజక సేవా సంఘం, శ్రీలక్ష్మీ గణపతి రజక సేవా సంఘం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన బల్లల పండగ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా హాజరై రజక వృత్తిదారుల సంప్రదాయక బల్లల పండగను కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. గరగ నృత్యాలు, వివిధ దేవతామూర్తుల వేషధారణలు, బాణసంచా కాల్పుల మధ్య అమ్మవారి గ్రామోత్సవాన్ని నిర్వహించారు. బట్టలు ఉతకడంలో తమకు జీవనాధారంగా ఉండే రాతిబండను అమ్మవారిగా అలంకరించి రజకులు పూజలు నిర్వహించి హారతులిచ్చారు. బీసీ జేఏసీ రాష్ట్ర చైర్మన్ మార్గాని నాగేశ్వరరావు, పోలు విజయలక్ష్మి పాల్గొన్నారు. అనంతరం గోదావరి గట్టుపై శేషమ్మ మెట్ట వద్దగల శ్రీ కనకదుర్గ గుడిలో అమ్మవారి దర్శనం చేసుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు.


బల్లల పండగలో పాల్గొన్న ఎంపీ భరత్‌రామ్

ఎలుకల నివారణ చర్యలు చేపట్టాలి

కడియం: వరి సాగు చేసే రైతులు సామూహికంగా ఎలుకల నివారణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి కె.ద్వారకాదేవి కోరారు. ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మండలంలో 4,800 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారన్నారు. ఇందులో 95 శాతానికి పైగా ఎంటీయూ 1121 రకం వరినే సాగు చేస్తున్నట్లు చెప్పారు. మిగిలిన అయిదు శాతం బొండాలు, ఆర్ఎస్ఆర్ రకాలు ఉంటాయని వివరించారు. ప్రస్తుతం వరి దుబ్బు కట్టే దశలో ఉన్నందున ఎలుకల తీవ్రత పెరిగేందుకు అవకాశం ఉందని ఏవో తెలిపారు. ఎలుకల నివారణకు బ్రోమోడయలిన్ మందులను రైతులకు ఉచితంగా అందిస్తున్నామన్నారు. రైతులు సామూహికంగా ఈ మందును వినియోగించడం ద్వారా మంచి ఫలితాలు ఉంటాయన్నారు. పలుచోట్ల గట్లను ఆనుకుని ఎలుకలు వరి దుబ్బులను కొరుకుతున్నట్లుగా గుర్తించామన్నారు. రైతులు అప్రమత్తమై ఎలుకల నివారణ మందును వినియోగిస్తే సమర్థంగా ఎలుకల బారి నుంచి వరిని రక్షించుకోవచ్చని ద్వారకాదేవి తెలిపారు.

తూర్పు రైల్వేస్టేషన్ రోడ్డు తాత్కాలికంగా మూసివేత

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాజమహేంద్రవరం తాడితోట వీరభద్రపురం నుంచి తూర్పు రైల్వేస్టేషన్‌కు వెళ్లే రోడ్డును నగరపాలక సంస్థ అధికారులు రెండురోజుల నుంచి నిలుపుదల చేశారు. ఎండోమెంట్ ఆవ వాంబేకాలనీ వద్ద అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం వేగంగా సాగుతోంది. ఈ నేపథ్యంలో ఆప్రాంతంలో రోడ్డును తవ్వి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం చేపట్టాల్సి ఉంది. నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను ప్రారంభించారు. దీంతో వాహనాలు రాకపోకలను నిషేధిస్తూ అధికారులు బోర్డులు ఏర్పాటు చేశారు. రాజమహేంద్రవరం నగరం నుంచి బాలాజీపేట ప్రాంతానికి వెళ్లేవారు, అటు నుంచి నగరానికి వచ్చే వాహన చోదకులు షెల్టాన్ హోటల్ పక్క నుంచి ఆవవాంబేకాలనీలో అపార్టుమెంట్ల మధ్యన వేసిన కొత్తరోడ్డు నుంచి సవితాల చక్రభాస్కరరావు అపార్టుమెంటు మీదుగా రాకపోకలు సాగిస్తున్నారు. ద్విచక్ర వాహనాలు మాత్రమే ఈ రహదారిలో వెళ్లే అవకాశం ఉంటుంది. మిగిలిన వాహనాలు షెల్టాన్ హోటల్ మీదుగా 100 ఫీట్ రోడ్డుమీదుగా, లేక ఎస్‌టీపీ ప్లాంట్ మీదుగా జాతీయ రహదారిపై నుంచి రాకపోకలు సాగించాల్సి ఉంటుంది. సుమారు 15రోజుల పాటు తూర్పు రైల్వేస్టేషన్ రోడ్డు మూసివేస్తామని, వాహన చోదకులు గమనించాలని అధికారులు చెప్పారు.


అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి తవ్విన గొయ్యి

మద్యం బాటిల్స్ స్వాధీనం

రాజమహేంద్రవరం సిటీ: మద్యం, గంజాయి అక్రమ రవాణా సాగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని జీఆర్పీ ఎస్ఐ మావుళ్లు హెచ్చరించారు. ఎన్నికల నేపథ్యంలో విజయవాడ రైల్వే జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ రైల్వే పోలీస్ రాహుల్ దేవ్ సింగ్ ఆదేశాల మేరకు ఉన్నతాధికారుల సారథ్యంలో రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్ మొదటి ప్లాట్ ఫారంపై గంజాయి, మద్యం, డబ్బు అక్రమ రవాణాపై తనిఖీలు చేస్తుండగా రైలులో లింగంపల్లి నుంచి రాజమహేంద్రవరం వరకూ ప్రయాణించిన వాసంశెట్టి ధనరాజ్ తెలంగాణకు చెందిన 6 మద్యం బాటిళ్లు తీసుకొని వెళ్తుండగా అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు ఎస్సై మావుళ్లు తెలిపారు.


జీఆర్పీ పోలీసులు స్వాధీనం చేసుకున్న తెలంగాణ మద్యం బాటిల్స్

ఎమ్మెల్యేను కలిసిన డాక్టర్ గూడూరి

అనపర్తి: వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం లోక్‌సభ సమన్వయకర్తగా నియమితులైన డాక్టర్ గూడూరి శ్రీనివాస్ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డిని మర్యాదపూర్వంగా కలిసారు. ఆదివారం అనపర్తి వచ్చిన గూడూరి శ్రీనివాస్ దంపతులు స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డి గూడూరికి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలియజేశారు. అదేవిధంగా నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నేతలు, నాయకులను గూడూరి శ్రీనివాస్‌కు పరిచయం చేశారు. అనంతరం డాక్టర్ గూడూరి దంపతులను ఎమ్మెల్యే చేతులమీదగా ఘనంగా సత్కరించారు.

గోవధ శాలపై పోలీసుల దాడులు

కంబాలచెరువు: స్థానిక జాంపేట సమీపంలోని మదన్‌సింగ్ పేటలోని గోవధ శాలపై ఒకటో పట్టణ పోలీసులు ఆదివారం దాడులు చేశారు. అక్కడ గో మాంసం అమ్మకాలకు మాత్రమే అనుమతి ఉంది. గోవధకు అనుమతి లేకపోవడంతో దాని నిర్వాహకులైన ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. సీఐ పుల్లారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

సోమాలమ్మను దర్శించుకున్న డాక్టర్ గూడూరి


సోమాలమ్మకు పూజలు చేసిన డాక్టర్ గూడూరి

రాజమహేంద్రవరం సిటీ: వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం లోక్‌సభ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ దంపతులు ఆదివారం నగరంలోని గ్రామదేవత శ్రీసోమాలమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టడానికి ముందుగా సోమాలమ్మ అమ్మవారికి గూడూరి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ గూడూరి శ్రీనివాస్ దంపతులకు ఉభయ రాష్ట్రాల శెట్టిబలిజ మహానాడు అధ్యక్షుడు పిల్లి సుబ్రహ్మణ్యం శాలువా కప్పి సత్కరించారు. డాక్టర్ గూడూరి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రముఖులను కలిసి ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుడుతున్నట్టు తెలిపారు. పార్లమెంటు స్థానాన్ని అత్యధిక మెజారిటీతో గెలిచి సీఎం జగన్ కు కానుకగా అందిస్తానని, అందుకు తనను ఆశీర్వదించాలని అమ్మవారిని కోరుకున్నానన్నారు.

ఉచితంగా హనుమాన్ సినిమా ప్రదర్శన

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఇటీవల విడుదలై ప్రపంచ వ్యాప్తంగా విశేష ఆదరణ పొందిన హనుమాన్ చిత్రాన్ని రాజమహేంద్రవరం అనుశ్రీ ఫిలిమ్స్, రాజా థియేటర్‌లలో శ్రీ రామ భక్తులకు, ఏకలవ్య చిల్డ్రన్స్ హోమ్ పిల్లలకు జర్నలిస్టులకు ఉదయం ఆటను ఉచితంగా ప్రదర్శించారు. అనుశ్రీ ఫిలిమ్స్ అధినేత, అత్తి సత్యనారాయణ, హెల్పింగ్ హ్యాండ్స్ టీం అలివేలు మంగతాయారు, అనుపూ బాలాజీ, ప్రియా పాల్గొన్నారు.

5న రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ దత్త పర్యటన

రాజమహేంద్రవరం సిటీ : రోటరీ క్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం ఐకాస్ ద్వారా విస్తృతంగా సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని అధ్యక్షుడు తీగలరాజా తెలిపారు. ఆదివారం నగరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈనెల 5వ తేదీన రోటరీ క్లబ్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ రావూరి సుబ్బారావు (దత్త) అఫీషియల్ విజిట్ సందర్భంగా 25 కార్యక్రమాలకు రూపకల్పన చేసినట్లు తెలిపారు. సోమవారం ఉదయం 8 నుంచి రాత్రి 9 గంటల వరకు రోటరీ క్లబ్ గవర్నర్ సారథ్యంలో పలు కార్యక్రమాలను విజయవంతం చేయడానికి అందరూ సహకరించాలని కోరారు. 10 మహా వృక్షాలకు చికిత్స చేసి మళ్లీ ప్రతిష్ఠ చేస్తున్నామన్నారు. సెక్రటరీ పి.అనుకుమార్, కోశాధికారి గ్రంధి రాజా, ఇమ్మణి వెంకట్, ఎం.వెంకటేశ్వరరావు, సాయితాతారావు పాల్గొన్నారు.

మంచి ఆహారపు అలవాట్లతో క్యాన్సర్ దూరం


నగరంలో నిర్వహించిన అవగాహన ర్యాలీ

రాజమహేంద్రవరం సిటీ: మంచి ఆహారపు అలవాట్లతో క్యాన్సర్ మహమ్మారిని తరిమి కొట్టవచ్చునని జేసీఐ న్యూ హారిజన్స్ అధ్యక్షురాలు డాక్టర్ అనసూరి ప్రియాంక పేర్కొన్నారు. క్యాన్సర్ డే ను పురస్కరించుకుని ఆదివారం జేసీఐ శ్రీమేధ, జేసీఐ న్యూ హారిజన్స్ సంయుక్త ఆధ్వర్యంలో పుష్కర్ ఘాట్ నుంచి కోటగుమ్మం వరకూ క్యాన్సర్ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్‌కే మాల్‌లో క్యాన్సర్ వ్యాధి గుర్తింపు, నివారణ తదితర అంశాలపై మహిళలకు అవగాహన కల్పించారు. అమూల్య దాసరి, యర్రా శ్రీరామ్ పాల్గొన్నారు.

సినిమాలు

శ్యామల	: కిస్మత్
సూర్యమినీ	: గేమ్ఆన్
సూర్యప్యాలెస్	: హ్యాపీఎండింగ్(మార్నింగ్‌షో), ఫైటర్(మూడుఆటలు)
స్వామి	: బూట్‌కట్‌బాలరాజు
శివజ్యోతి	: అంబాజీపేటమ్యారేజీబ్యాండు
అనుశ్రీ	: హనుమాన్
రాజా	: హనుమాన్
అశోక	: సలార్
ఊర్వశి	: నాసామిరంగా
రంభ	: కెప్టెన్‌మిల్లర్
మేనక	: ధీర
అప్సర	: గుంటూరుకారం
కుమారి	: అంబాజీపేట మ్యారేజీబ్యాండు
నామవరం	
వీఎస్.మహల్	: హనుమాన్
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	: అంబాజీపేటమ్యారేజీబ్యాండు
కడియం	
వెంకటసూర్య	: హనుమాన్

పోటీ పరీక్షల అభ్యర్థులకు అవగాహన

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): స్థానిక ఆనం కళా కేంద్రంలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు అవగాహన సదస్సు ఆదివారం జరిగింది. ఈ సదస్సు ఎమ్మెల్సీలు కేఎస్ లక్ష్మణరావు, ఐ.వెంకటేశ్వరావుఆధ్వర్యంలో యూటీఎఫ్, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ, వీరేశలింగం ట్రస్ట్ సంయుక్త నిర్వహణలో జరిగింది. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ.షరీఫ్, రాష్ట్ర కార్యదర్శి ఎన్.అరుణ కుమారి మాట్లాడారు. అభ్యర్థులకు గ్రూప్స్ మెటీరియల్ ఉచితంగా పంపిణీ చేశారు.